# నగరంలో నామినేషన్ల సందడి

### పలు నియోజకవర్గాల నామినేషన్లను సమర్పించిన అభ్యర్థులు

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలలో కీలక ఘట్టం మొదలైంది. ఎన్నికల బరిలో పోటీని ఖరారు చేసే నామినేషన్ల పర్వానికి అభ్యర్థులు తెరలేపారు. తొలి రోజున అంతంత మాత్రంగానే అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. ఈ క్రమంలో మహానగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆర్వో సెంటర్‌కు వంద మీటర్ల దూరంలో 144 సెక్షన్ విధించి ఏర్పాట్లు చేశారు. తొలి రోజున ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు మినహా స్వతంత్ర, రెబల్ అభ్యర్థులే నామినేషన్లు దాఖలు చేశారు. ఇక మలక్ పేట్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన బీఎస్పీ అభ్యర్థి రమేష్ ప్రచార ఆర్భాటంతో బయలుదేరగా, సమయానికి సెంటర్‌కు చేరుకోలేకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. బరిలో ఉన్న మరో అభ్యర్థి మహ్మద్ అక్రం అలీఖాన్ నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైన తొలి రోజు కావడంతో ఆశించిన మేర హడావుడి కనిపించలేదు. శుక్రవారం నామినేషన్ వారిలో ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థులే ఉండగా, కొన్ని నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా రాలేదు. సికింద్రాబాద్ నుంచి శివసేన అభ్యర్థి సుదర్శన్ నామినేషన్ వేయగా, సికింద్రాబాద్ నుంచి అడ్డగుట్టకు చెందిన స్వతంత్ర అభ్యర్థి రాహుల్ గుప్తా నామినేషన్ సమర్పించారు.




నామినేషన్ల కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు

### మేడ్చల్‌లో ఆరు నామినేషన్లు

మేడ్చల్, నవంబర్3(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మొదటి రోజైన శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలైనట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం నుంచి 2, ఉప్పల్ నియోజవర్గం నుంచి 2, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి 1, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి 1 నామినేషన్లు దాఖలు అయినట్లు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ స్పష్టం చేశారు.

**నామినేషన్ల దాఖలు వివరాలు**

| నియోజకవర్గం | నామినేషన్ దాఖలు |
|---|---|
| మేడ్చల్ | శ్రీధర్‌రెడ్డి (ఇండిపెండెంట్) |
| మేడ్చల్ | ప్రవీణ్ కుమార్ రెడ్డి (ఇండిపెండెంట్) |
| మల్కాజిగిరి | జాజుల భాస్కర్ (శ్రమజీవి పార్టీ) |
| కుత్బుల్లాపూర్ | చంద్రశేఖర్ చలిక (ఇండిపెండెట్) |
| ఉప్పల్ | వేరుచిన్న ధన్‌రాజ్(ఇండిపెండెట్) |
| ఉప్పల్ | ఎం.మల్లేశం (తెలంగాణ ప్రజాజీవన రైతుపార్టీ) |



శుక్రవారం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. - అబిడ్స్, నవంబర్ 3

## నేడు చలో జల విహార్.. ఆత్మీయ సమ్మేళనం

- బీఆర్ఎస్‌కు భారీ ఎత్తున న్యాయవాదుల మద్దతు
- సభకు హాజరు కానున్న మంత్రి కేటీఆర్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి భారీ సంఖ్యలో హాజరయ్యేందుకు నాంపల్లి కోర్టు బీఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఉదయం 11 గంటలకు నెక్లెస్ రోడ్డులోని జల విహార్‌లో ఏర్పాటు చేసిన సభకు మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారని, బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా 'చలో జల విహార్' పేరిట సభను ఏర్పాటుచేసిన సందర్భంగా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు నాంపల్లి కోర్టులో న్యాయవాదులను కలిసి మద్దతు కూడగట్టారు. ఈ సభా సమావేశానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌లు సైతం హాజరు కానున్నారు. హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా విజయం సాధించేందుకు కలిసికట్టుగా ముందుసాగాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, బీఆర్ఎస్ సభ్యులు తిరుపతి వర్మ, డి.అనంత రఘు, సురేఖ సింగ్, శ్రీనాథ్, రాకేశ్, విజయీభవ పాట రచయిత లక్ష్మణ్ గంగా తదితరులు పాల్గొన్నారు.

## అశాంతి వాతావరణం.. ప్రపంచ దేశాలకు సవాళ్లే..

**సెస్‌లో ఐఏఎస్ఎస్ఐ సదస్సులో ఆర్థిక నిపుణుల అభిప్రాయం**




ఐఏఎస్ఎస్ఐ సదస్సులో మాట్లాడుతున్న ఆర్థిక నిపుణులు

సిటీబ్యూరో, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): దేశాల మధ్య వస్తు, సేవల సరఫరాలో తీవ్ర ఆటంకాలు, ఆహార ఉత్పత్తులు, చమురు ధరల పెరుగుదల, ప్రతికూల పర్యావరణం, సామాజిక అశాంతి వంటివి ప్రపంచ దేశాలకు సవాళ్లేనని టీఐఎస్ఎస్ ప్రొ. కే సీతా ప్రభు అన్నారు. సెంటర్ ఫర్ సోషల్ స్టడీస్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ సైన్స్ ఇనిస్టిట్యూషన్స్ శుక్రవారం సంయుక్తంగా నిర్వహిస్తున్న 22వ వార్షిక సదస్సులో ప్రొ. కే సీతా ప్రభు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'బహుళ సంక్షోభాల కాలంలో అభివృద్ధి విధానాలు – 21వ శతాబ్దం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై ప్రొ. డి.నర్సింహారెడ్డి అధ్యక్షతన ప్రముఖ ఆర్థికవేత్త తర్లోక్ సింగ్ స్మారక ఉపన్యాసంలో ప్రసంగించారు. పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధం సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయడం, అసమానతలు పెరగడం, మానవ జీవనానికి ప్రమాదంగా మారుతుందన్నారు. కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక ప్రయోజనాలు ఉన్నాయి. కాని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే క్రమంలో నిర్వహణ వ్యయాలు పెరుగుతాయని అన్నారు. 'భారత దేశంలో ఉపాధి కల్పన– సవాళ్లు' అనే అంశంపై జరిగిన టెక్నికల్ సెషన్‌లో హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ ప్రొ.అలక్ ఎన్ శర్మ, సీనియర్ అధ్యాపకులు డా. బల్వంత్ సింగ్ మెహతా ప్రసంగించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ప్రొ.రేవతి, ఎన్ఐఆర్డీ పార్థా ప్రతిమ్ సాహూతో పాటు దేశంలోని వివిధ ప్రముఖ విద్యా, పరిశోధన సంస్థల నుంచి 52 మంది పరిశోధన పత్రాలను సమర్పించగా, పలు అంశాలపై లోతైన చర్చా గోష్టిలను నిర్వహించారు. కాగా, నేటితో వార్షిక సదస్సు ముగియనున్నది.

# పేదల అభ్యున్నతే కేసీఆర్.. పీజేఆర్‌ల లక్ష్యం

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్..
- విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులతో, బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం
- కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటారు: పీవీఆర్

జూబ్లీహిల్స్/బంజారాహిల్స్, నవంబర్ 3: నగర అభివృద్ధికి నాడు పీజేఆర్ చేసిన సేవలకు దీటుగా నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ మహమూద్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులతో, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఐదు దశాబ్దాలు సేవ చేసిన కుటుంబానికి టికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేశారంటే, ఆ పార్టీ ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమైనా.. తన తండ్రి పీజేఆర్ ఆశయ సాధనైనా ఒక్కటే.. కాబట్టి నేడు పీవీఆర్ బీఆర్ఎస్ పార్టీలోకి అడుగు పెట్టారన్నారు. తన తండ్రి కోరుకున్న విధంగా పేదలను, అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తున్న సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పీవీఆర్ గుర్తించబట్టే నేడు బీఆర్ఎస్ పార్టీతో మమేకమయ్యేందుకు సిద్ధమయ్యాడని అన్నారు. తనకంటే వయసులో చిన్నవాడైనా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా తన కంటే సీనియర్ అని, విష్ణు తన సోదర సమానుడని అన్నారు. అనంతరం, విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి 52 ఏండ్లు సేవ చేసిన పీజేఆర్ కుటుంబానికి టికెట్ ఇచ్చేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారంటే అంత కన్నా అవమానం మరొకటి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే నేడు రాష్ట్రాన్ని అమ్ముకునే దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నారని అన్నారు. హైదరాబాద్ నగరానికి పీజేఆర్ చేసిన సేవలను గుర్తించి కొడిగట్టిన దీపం లాంటి నా రాజకీయ జీవితాన్ని సీఎం కేసీఆర్ తిరిగి నిలబెట్టారని అన్నారు. పీజేఆర్ కుటుంబానికి అవమానం చేసిన కాంగ్రెస్‌కు పీజేఆర్ అభిమానులు, ఆత్మీయులు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ ఎన్నికలలో మాగంటి గోపీనాథ్ కాదని, గతంలో నాకు వచ్చిన 56 వేల పీజేఆర్ అభిమానుల ఓట్లతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థిని బంపర్ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదల కోసం కష్టపడి పనిచేయడం తన తండ్రి నుంచి అలవడిందని.. ఇకపై బీఆర్ఎస్ పార్టీలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పీజేఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ కట్టెల శ్రీనివాస్ యాదవ్, మైనార్టీ రాష్ట్ర నేత సొహైల్, కార్పొరేటర్లు రాజ్ కుమార్ పటేల్, దేదీప్య రావు, సీఎన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.





ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

# మధురానగర్ ఏటీఎంలో మోసగాడు

**అకౌంట్లో క్రెడిట్ చేస్తానని.. డబ్బుతో పరార్**

వెంగళరావునగర్, నవంబర్ 3: ఏటీఎంలో డబ్బు జమ చేసేందుకు వెళ్లిన ఓ ఖాతాదారుడిని బురిడీ కొట్టించి డబ్బుతో ఓ మోసగాడు ఉడాయించిన ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, ఎల్లారెడ్డిగూడకు చెందిన జి.ఇంద్ర మాన్యూన్ టెల్ ప్రొడక్షన్‌లో మేనేజర్‌గా పనిచేస్తుంటారు. కంపెనీ యజమాని గాంధీ పినిశెట్టి తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడంతో మణికొండలోని స్నేహితుడి నుంచి రూ.95 వేలను ఇంద్ర చేత తెప్పించారు. గురువారం రాత్రి మధురానగర్ మెట్రో స్టేషన్ ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎం వద్దకు ఇంద్ర వచ్చి తొలుత రూ.49,500లను తన స్నేహితుడి అకౌంట్‌కు జమ చేశారు. మరోసారి మిగిలిన రూ.45,500లను జమ చేసేందుకు ఇంద్ర ప్రయత్నించగా, సాంకేతిక సమస్యతో ఎస్బీఐ ఏటీఎం మొరాయించింది. అదే సమయంలో ఏటీఎంలోకి ఓ అజ్ఞాత వ్యక్తి వచ్చాడు. తన అకౌంట్లో డబ్బు ఉందని, మీ అకౌంట్‌కు క్యాష్ క్రెడిట్ చేస్తా, ఆ డబ్బు ఇవ్వమంటూ కోరాడు. రెండు గంటల్లోపు డబ్బు జమ అవుతుందని నమ్మించాడు. తన పేరు రాము అని, బ్యాంక్ అకౌంట్ నెంబర్, సెల్ ఫోన్ నెంబర్ కూడా ఇచ్చాడు. అపరిచితుడికి రూ.45,500 ఇంద్ర ఇచ్చాడు. ఎంతసేపైనా డబ్బు అకౌంట్లో జమ కాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఫోన్ నెంబర్‌కు మెసేజులు పంపినా స్పందన లేకపోయేసరికి తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు ఇంద్ర మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.